క్లుప్తంగా

నేడు గరుడసేవ

చిత్తూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శనివారం గరుడసేవను నిర్వహించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. విశేషపూజలు చేసి సాయంత్రం 5 గంటల సమయంలో గరుడసేవను ప్రారంభిస్తామన్నారు.

పెనుగాలులకు రాలిన మామిడి కాయలు



విక్రయానికి ఉంచిన కాయలు

తవణంపల్లె: మండలంలో వీచిన పెనుగాలులకు మామిడి కాయలు రాలిపోయి రైతులకు నష్టం సంభవించింది. మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలులకు సుమారు 150 టన్నులకు పైబడి రాలిపోయాయి. రాలిన మామిడి కాయలను వ్యాపారులు కిలో రూ.7 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

5న వేసవి వెన్నెల

చిత్తూరు రూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 5న వేసవి వెన్నెల సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మధుసూదనం తెలిపారు. ఆర్‌కే విద్యాలయ జూనియర్ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తుంబకుప్పంలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నట్లు తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుబ్రమణ్యం అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తుంబకుప్పంలో ఉపాధ్యాయుల బృందం పర్యటించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు కోరారు. ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న ఉచిత విద్యాపథకాలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ, శ్రీదేవి, అమ్ములు పాల్గొన్నారు.

చిత్తూరు వెస్ట్ సీఐగా రవిశంకర్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు వెస్ట్ సీఐగా రవిశంకర్‌రెడ్డిని నియమిస్తూ పోలీసుశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు రెడ్డి అవినీతి నిరోధక శాఖకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డి, రెండురోజుల్లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు.

నగరంలో ఇంటింటికీ బీజేపీ



జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద నినాదాలు చేసిన బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ హయాంలో దేశ వ్యాప్తంగా అభివృద్ధి సాగుతోందని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి వెంకటశివనారాయణ తెలిపారు. చిత్తూరులో ఇంటింటికీ శుక్రవారం బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత తొమ్మిదేళ్లుగా బీజేపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయనున్నట్లు వివరించారు. అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, షణ్ముగం, గోకుల్ పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 159 మందికి ఉద్యోగాలు



చిత్తూరు కలెక్టరేట్: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 159 మంది ఎంపికైనట్లు ఆర్‌కే విద్యాలయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. నగరంలోని మిట్టూరులో ఉన్న ఆర్‌కే విద్యాలయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మండల సమావేశంలో ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న ఏపీఎం ఈశ్వరి



వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా చూడాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయాల నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. జగనన్న చేపడుతున్న సంక్షేమ పథకాలను సర్పంచులు, ఎంపీటీసీలు వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పట్టాలు కావాల్సిన వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డులు ఇకపై ఆరునెలలకోసారి మాత్రమే మంజూరు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎవరైనా సర్వే చేయించుకోవాలంటే దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లోనే రైతులకు సంబంధించి భూములు సర్వే చేస్తామన్నారు. ఇందిరా క్రాంతి ఏపీయం ఈశ్వరి మాట్లాడుతూ మండలంలో 881 మంది గ్రూపులు ఉన్నాయన్నారు. రామభద్రాపురంలో ఓ సంఘం సభ్యులు రుణాల స్వీకరణకు ముందుకు వస్తే పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. గడపగడపలో వచ్చిన సమస్యలను ఇంతవరకు పరిష్కరించలేదని ట్రాన్స్‌కో ఏఈని పలువురు నిలదీయగా త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. ఎంఈవో రామ్‌నాయక్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాల తెరిచిన రోజునే విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ రమ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్ర, సర్పంచులు రజినీకాంత్, జనార్దన్, పెరిల్లా, మోహన్, జయకోడి, గుణవతి, ఎంపీటీసీలు మొగిలిరెడ్డి, గోపి, బాలమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సజావుగా అందిస్తున్న వలంటీర్ల సేవలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొనియాడారు. మండలంలోని వసంతాపురం, గుడిపాల, పాపసముద్రం, చిత్తపార సచివాలయాల్లో శుక్రవారం నిర్వహించిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు నిబద్ధతతో వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరొస్తోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు



గుంతూరులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: నవరత్న పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పెద్దవంక, కురప్పల్లె, కొండేటివాండ్లఊరు, గుంతూరు, దళితవాడ, ఎస్టీ కాలనీ, మాదిగవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేసి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా కుటుంబానికి ఏఏ పథకం కింద ఎంత మేరకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అర్హులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, మురుగునీటి కాలువలు, పింఛన్లు, కొత్తరేషన్ కార్డులు, సిమెంట్ రోడ్లు వేయించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పెదవంక నుంచి కురప్పల్లెకు వెళ్లే రహదారిని బాగుచేయాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతలను విస్మరించొద్దు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని ఎమ్మెల్యే అన్నారు. గుంతూరు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన అధికారులు, గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. అధికారులు తమ బాధ్యతలను విస్మరించి విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ గౌరమ్మ, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యులు ఫిరోజ్‌అహ్మద్, లోకేష్, మనోహర్, వడ్డెర, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు మొగిలీశ్వర, అమరనాథ్, జిల్లా బీసీ నాయకులు దొరస్వామి, సుబ్రమణ్యం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, ప్రభు, నాగరాజ, జగదీష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహంపై అప్రమత్తత



వృద్ధురాలికి వైద్యం చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మధుమేహ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 75 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ మధుమేహ వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వాడకపోతే అనర్థాలు ఎదురవుతాయన్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాలులు వీస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా 'కంచి గరుడసేవ'



గరుడ వాహన సేవలో టీటీడీ అధికారులు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఆలయంలో శుక్రవారం కంచి గరుడసేవను వైభవంగా నిర్వహించారు. గరుడ వాహనంపై దేదీప్యమానంగా ఆశీనులైన కరియమాణిక్యస్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. టీటీడీ ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి జిల్లా యువకుల కోలాటాలు, రాజమండ్రి వారి పండరి భజన బృందాలు, బ్యాండు వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో కంచి గరుడ వాహనంపై కరియమాణిక్య స్వామి విహరించారు. స్వామివారిని దర్శించుకోవడానికి మాడవీధుల్లో భక్తులు బారులు తీరారు. ఫలపుష్పాలు, కొబ్బరి కాయలు సమర్పించి కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్నమ్మ, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, గుణశేఖర్, కిషోర్‌బాబు, జానకి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ నేతృత్వంలో స్కౌట్ విద్యార్థులు, ఆలయ సేవకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాల ఎగ్జిబిషన్‌లో సంఘం సభ్యులు

గుడిపాల: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్, వెలుగుసీసీ హేమచంద్రారెడ్డి అన్నారు. వసంతాపురంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పౌష్టికాహార విలువలు కలిగిన ధాన్యాలు, కూరగాయలు, చిరుధాన్యాలు పండ్లు మొదలగు వాటిని ఎగ్జిబిషన్ పెట్టి నిర్వహించారు. వారు అంగన్‌వాడీల్లో ఇచ్చే ఆహారం ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. అనంతరం హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ సంఘంలో లేని మహిళలను గుర్తించి కొత్తగా సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని సంఘ మిత్రలకు సూచించారు. ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ కింద రెండు లక్షల నుంచి పదిలక్షల వరకు సంఘం సభ్యురాలికి పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త నియామకం కోసం నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

ఐరాల: మండలంలోని చెంగనపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తను నియమించాలని శుక్రవారం కోళ్లపల్లె సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రాథమిక పాఠశాల వద్ద నిరసన తెలిపారు. స్థానికులు గ్రామంలో 30 మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నారు. శాశ్వత కార్యకర్త లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులను సంప్రదించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో శాశ్వత కార్యకర్తను నియమిస్తామని తెలిపారు.

దోమలను నివారిద్దాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

యాదమరి: గ్రామాల్లో దోమలను నివారిద్దాం మలేరియా వ్యాధి నుంచి కాపాడుకుందాం అని ప్రభుత్వాసుపత్రి వైద్యులు సూచించారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మండలంలోని 180 కొత్తపల్లె ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో వైద్యులు పర్యటించారు. వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో శుభ్రం చేసి పెనాయిల్, బ్లీచింగ్ చల్లారు. నిల్వ ఉన్న నీటిని కిందపోసి పాత్రలను ఆరబెట్టారు. అనంతరం గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజలు తమ నివాస గృహాల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది దాడులు చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సప్తకనికలమ్మ సేవలో మంత్రి





సప్తకనికలమ్మ, అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం దొడ్డిపల్లిలోని శ్రీ సప్తకనికలమ్మను శుక్రవారం రాష్ట్ర విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, నాయకులు భూపేష్ గోపీనాథ్, కృష్ణమూర్తి, లోకేష్ రెడ్డి, గురుకువారిపల్లె ప్రకాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎత్తుకు పైఎత్తు



చదరంగంలో గెలుపొందిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: చందరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎత్తుకు పై ఎత్తు వేస్తూ అద్భుతంగా ఆడారు. నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో అండర్ 19 చందరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో వర్షిణి (మొదటి బహుమతి), లేఖ్య, జనాన్య (ద్వితీయ, తృతీయ), బాలుర విభాగంలో అభినవ సూర్యతేజ్ (మొదటి), లోహిత్ అక్షయ నాయక్, ఆరుష్ నాయక్ (ద్వితీయ, తృతీయ) బహుమతులు సాధించారు. ఇందులో గెలుపొందిన బాలికలు ఈ నెల 15న ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో, బాలురు ఈ నెల 8వ తేదీన నంద్యాల జిల్లా లో నిర్వహించే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని పోటీల నిర్వాహకుడు ప్రసాద్ వెల్లడించారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

పూతలపట్టుకు మూడు ట్రాక్టర్లు



వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద ట్రాక్టర్ పంపిణీ చేస్తున్న అధికారులు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా మండలానికి బుధవారం 3 ట్రాక్టర్లను చిత్తూరు ఏడీఏ మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మధురవాణి తెలిపారు. పూతలపట్టు భీమేశ్వర గ్రూప్, గొడుగుచింత వెంకటేశ్వర గ్రూప్, పి.కొత్తకోట డాక్టర్ వైఎస్సార్ గ్రూప్‌కి ఈ ట్రాక్టర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ యూనిట్ ధరను బట్టి రైతు వాటా 10 శాతం, ప్రభుత్వ రాయితీ 40 శాతం, బ్యాంకు రుణం 50 శాతం ఉంటుందని ఆమె పేర్కొనారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నీలిమ, నవీన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తిరునాళ్లు



విశేషాలంకరణలో ముత్యాలమ్మ

గుడిపాల: పానాటూరు గ్రామంలో శుక్రవారం ముత్యాలమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి గ్రామంలోని మహిళలు అంబళ్లు పోశారు. అనంతరం ప్రత్యేకంగా పూజలు నిర్వహించడంతోపాటు అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి గ్రామవీధుల్లో బాణసంచావేడుకలు, మంగళవాయిద్యాల మధ్య అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.

నగర అభివృద్ధే అజెండా!



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

- అద్భుతాలు చేయట్లేదు.. అవసరాలు తీరుస్తున్నాం
- నాలుగేళ్లల్లో రూ.83 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 10 ఎకరాల్లో అధునాతన డంపింగ్ యార్డు ఏర్పాటు
- 'సాక్షి'తో చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు ఇస్తోందని, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనపైనే దృష్టి పెడుతున్నామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ జంగిటి అంటున్నారు. గత నాలుగేళ్లలో నగర పరిధిలో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, పార్కులు ఇతర అభివృద్ధి పనులకోసం రూ.83 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించిందని స్పష్టం చేశారు. ఇంకా రూ.46 కోట్లతో చిత్తూరు రూపురేఖలు మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వీటికి సైతం త్వరలోనే నిధులు రానున్నాయన్నారు. చిత్తూరు నగర అభివృద్ధిపై కమిషనర్ అరుణ 'సాక్షి'తో పంచుకున్న విషయాలు ఆమె మాటల్లోనే..

దశలవారీగా అన్నీ..

చిత్తూరు నగర అభివృద్ధి అనే స్పష్టంగా కనిపిస్తోంది. కార్పొరేషన్ హోదాలో ఉన్న చిత్తూరులో ఆ స్థాయి వసతులు లేవన్నది తెలిసిందే. ఇక్కడ ప్రజలకు కావాల్సిన రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, వీధి దీపాలు, ప్రజారోగ్యం వంటివి తప్పనిసరిగా చూడాలి. మన ప్రధాన రహదారి కూడళ్లు, రోడ్లను సుందరంగా తీర్చిదిద్దాలి. ఇక్కడ నమ్మశక్యం కాని అద్భుతాలు ఏమీ చేయడంలేదు. మౌలిక వసతులు, సదుపాయాలను దశలవారీగా ప్రభుత్వం పరిష్కరిస్తూ ముందుకు వెళుతోంది.

మీరే చూడండి..

గతంలో, ఇపుడు చిత్తూరు ఎలా ఉందో ప్రజలే చూస్తున్నారు. నగరంలోని ప్రతి ఒక్క ప్రధాన రహదారిలో పచ్చటి కూడళ్లను పెడుతున్నాం. రోడ్లను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు స్వచ్ఛంద సంస్థల సాకారంతో అందమైన పెయింటింగ్స్ వేయిస్తున్నాం. పీసీఆర్ సర్కిల్ నుంచి ఎంఎస్ఆర్ వరకు రోడ్డు డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు, వాటర్ ఫౌంటైన్లు పెట్టించాం. ఈ నెలలోనే వీటిని ప్రారంభిస్తాం. ఓబనపల్లెలో ఉన్న మునిసిపల్ డంపింగ్ యార్డు వల్ల చుట్టు పక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, ఈ మొత్తం చెత్తను అక్కడి నుంచి తీయించడానికి ప్రభుత్వం రూ.12 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎస్‌డబ్ల్యూఎమ్) కింద మురకంబట్టులో అధునాతన డంపింగ్ యార్డు పెడుతున్నాం. పది ఎకరాల స్థలాన్ని కూడా ప్రభుత్వం కేటాయించింది. ఇందులోకి చెత్తను తీసుకొచ్చేప్పుడే ఎరువుగా మార్చే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఫలితంగా ఒక్క కిలో చెత్త కూడా నిల్వ ఉండదు. దుర్వాసన అస్సలు ఉండదు.

ప్రభుత్వం సిద్ధంగా ఉంది..

నాలుగేళ్లల్లో చిత్తూరు నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.83 కోట్లు ఖర్చు చేసింది. నీటి ఎద్దడి రాకుండా కొత్త బోర్లు వేయడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం, కొత్త రోడ్లు, గాంధీ విగ్రహం, గంగినేనిచెరువు, కట్టమంచి చెరువు వద్ద ఆహ్లాదకరమైన పార్కు, వ్యాయామ పరికరాలు పెట్టించాం. పదేళ్లుగా జరగని మైదా ఫ్యాక్టరీ లింకు రోడ్డు పనులు ఇపుడు వేగంగా చేస్తున్నాం. ఇది కాకుండా నగర అభివృద్ధికి మరో రూ.46 కోట్లు అవసరం అవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. చిత్తూరును మరింత అభివృద్ధి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి పట్టుదలతో ఉన్నారు. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద, పాలక వర్గం పూర్తిగా ఇందులో భాగస్వామ్యమైంది. కనీస అవసరాలకు నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

మా దృష్టికి తీసుకురండి.

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం తీసుకొచ్చారు. ప్రజలు ఏ సమస్యలున్నా 1902 అనే నెంబర్‌కు ఫోన్‌చేసి చెప్పండి. కార్పొరేషన్ చేయగలిగిన పనులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలు ఏమున్నా నా దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి న్యాయం చేస్తా. సోమవారం స్పందనతో పాటు ఏ రోజు అయినా కార్యాలయ పనివేళల్లో నన్ను కలిసి సమస్యలు చెప్పొచ్చు.

నేడు వలంటీర్లకు సన్మానం

గుడిపాల: మండలంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. శనివారం ఉదయం నారగల్లు, ఏఎల్‌పురం, 197 రామాపురం, మధ్యాహ్నం తిమ్మయ్యపల్లె, మరకాలకుప్పం, నంగమంగళం, బొమ్మసముద్రం, పానాటూరు సచివాలయంలో వలంటీర్లకు సన్మానం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలన్నారు.

నీటి నిల్వలపై అవగాహన కల్పించండి



మరకాలకుప్పం పంచాయతీలో పర్యటిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు

గుడిపాల: నీటి నిల్వలు, వాటిని వాడే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యులు సచింద్రకుమార్‌సింగ్, సోమరేంద్రసింగ్ అన్నారు. మండలంలోని మరకాలకుప్పం పంచాయతీలో శుక్రవారం ఇంటింటికి కొళాయి కనెక్షన్ ఉందా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందేలా చూడాలని చెప్పారు. జలజీవన్‌మిషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వడమే లక్ష్యమన్నారు. ఉపాధిహామీ పనులు చేపట్టడం ద్వారా నీటినిల్వ ప్రాధాన్యతలో సాధించిన ప్రగతి చూసి అభినందించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద వివిధ శాఖలో చేపట్టిన చెరువులు, కందకాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప, ఏఈ హిమంత్, సర్పంచ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.